


# శేషమ్మ - A STUDY - చలం

*ఉదయిని మాసపత్రిక – 1936 లోని సంచికలో ప్రథమ ముద్రణ*

శేషమ్మకి ఈ లోకంలో ఏమాత్రమూ ఆనందమూ సౌందర్యమూ కనపడడం మానేసి ముప్పై ఏళ్ళయ్యింది. ఇతరులు నవ్వుతున్నా, తింటున్నా, పాడుతున్నా, ఆమెకి విచారమో లేక అసహ్యమో కలుగుతుంది. పిట్టల కూతలూ, పిల్లల నవ్వులు కూడా ఆమెని 'ఇరిటేట్' చేస్తున్నాయి.

"పాడుపిట్టలు – పనిలేదు వీటికి. వెధవ అరుపులూ, గోలలూ. అంతకన్నా చస్తేనేం?"

ఆమెకి ప్రపంచం దుఃఖమయం, పాపభూయిష్ఠం, అపవిత్రం. దీన్నంతా విడిచిపోవాలని మృత్యువుని తలుచుకుని అందరూ వినేట్టుగా ఆహ్వానిస్తూవుంటుంది. "ఆ ఈశ్వరుడు ఎప్పుడు దయతలుస్తాడో, ఎప్పుడు పిలిపించుకుంటాడో, ఈ నరకంలోంచి నన్ను!"

ఆ ఈశ్వరుడు తన తండ్రిలాగా, తనని భూలోకమనే అత్తవారింటికి పంపినట్టూ మాట్లాడుతుంది. నాలుగేళ్ళక్రిందట కలరా తగిలినప్పుడు మాత్రం –

"ఒరే, చస్తానురా, చస్తానురా. డాక్టరేమన్నాడూ? ఆస్పత్రి పెద్ద డాక్టర్ని పిలుచుకురా. ఆ పెరుగు తోడుకుందో లేదో చూచావుటే. మా అమ్మ ఎనభై ఏళ్ళు బతికిందిరా. ఇంత చిన్నదాన్ని నాకప్పుడే ఏం చావు? అవునులే. ఈ ముసిలి ముండ చస్తే ఎవరికేం? అందరికీ పీడ విరగడైపోతుంది." అంది మళ్ళీ.

ఆమె మొహాన నవ్వు చూసినవాళ్ళెవరూ లేరు. చిన్నపిల్లలు గంతులేస్తూ ఉంటే, "ఈ గంతులెన్నాళ్ళు? మీ కాళ్ళు విరగా. ఇదేం పోయేకాలంరా. సరిగా కూచుని ఏడవలేరూ?" అన్నట్టు చూస్తుంది. ఎంత విచారంగా కనపడితే, ఈ లోకం మీద ఈ మాయమీద ఎంత అసహ్యం కనపరిస్తే, ఎంత సౌందర్యాన్ని ద్వేషిస్తే ఈశ్వరుడికి అంత సన్నిహితురాలూ, ప్రియతమురాలూ ఐవుంటుంది. ఈ లోకంలో తనవంటి సన్మార్గులకు కష్టాలు తప్ప ఇంకేమీ లేవు కనక సుఖపడేవాళ్ళంతా దుర్మార్గులే ఐవుండాలి. తను కష్టాల కోసం ఎంత ప్రయత్నించి ఏరుకుంటుందో ఆమెకి తెలీదు.

"అదేమిటీ ఆ కామాక్షి అట్లా పాడుతూ ఉంటుంది ఎప్పుడూ! దేన్ని చూసుకునీ ఆ బోర్లపాటు! ఆ మొగుడి ఉద్యోగం ఊడితే తెలుస్తుంది, అమ్మగారి అదిర్పాటు!"

ఆమెని "ఎట్లావున్నారమ్మా!" అని అడిగితే ఎప్పుడూ "బాగానే ఉన్నా"నని అనలేదు. అసలు ఈ దేశంలో ఆ మాట అనేవాళ్ళే తక్కువ. నిజంగా బాగా ఉండేవాళ్ళే తక్కువ. బాగా ఉన్నా కూడా, బాగా ఉన్నామని తెలుసుకున్నవాళ్ళు చాలా తక్కువ. తెలుసుకున్నా,

'బాగావున్నా'మని అంటే దిష్టితగిలి, అదృష్టం మారుతుందని ఆ మాట అనరు. అంతేకాక బాగా ఉండడం దోషమనీ, పాపాత్ములు మాత్రమే బాగా ఉంటారనీ, మూర్ఖులు మాత్రమే బాగా ఉన్నామనుకుంటారనీ నమ్మకం.

"ఏం బావుండడమమ్మా! కుర్రాడికి నిన్నటినుంచి జలుబు కదా! ఇంతవరకు కన్ను (ముక్కు అనాలి) తెరచి ఎరగడు. ఆవు పాలివ్వడం మానేసింది. మొన్ననేగా మా తాతగారి సవితి తల్లి మేనమామ పోయినాడు. వాడి మనుమడు మూడోక్లాసు తప్పిపోయినాడా! రాచ్చిప్ప చిల్లిపడ్డది. నిక్షేపమంటి రాచ్చిప్ప! ఇట్లా ఉంది మా గతి. ఏమోనమ్మా ఈ కాలంలో అంతా మాయ. మాయ రాచ్చిప్పలూ, మాయమనుషులూ! అవునులే అమ్మా! ఏం శాశ్వతం? ఈ దేహమూ అంతేకద, ఊరికే పట్టుకు పాకులాడతారు గాని."

ఈ వాక్యాలే ఏ దేశాభిమాని ఐనా విన్నాడా, అక్కడే మూడు పల్టీలు కొట్టి, "హా భారతమాతా! ధన్యురాలివి. ఇట్లాంటి ఆధ్యాత్మికులైన ముసలమ్మల్ని కన్నావు" అని అరిచి ఆనందంలో మూర్ఛపోతాడు.

"దుగ్గిరాలవారింట్లో పెళ్ళయిందా? వాళ్ళకేం? పెళ్ళిళ్ళూ చేస్తారు, ఒడుగులూ చేస్తారు. వాళ్ళ ముత్తాత మూటలు సంపాయించి పడేసిపోయినాడుగా! ఒక నీతా, న్యాయమా? ఏముందీ? పరాయివాళ్ళని దోచుకునేదీ, పెళ్ళిళ్ళు చేసేదీ!"

డబ్బు ఉందంటే, అన్యాయార్జితమనే ఆమె ఉద్దేశ్యం.

ఎవరన్నా - "అదీ, ఆ రత్తమ్మ! మొన్న రాత్రి పారిపోయిందటమ్మా!" అంటే, - శేషమ్మ - "ఛీ, ఛీ. అట్లాంటి మాటలు నా చెవిని పడనీకు. నాకెందుకు? నా రామనామమేమో నేనేమో! సరే కానీ, ఇంతకీ, ఎవడితో?"

"అక్క ఇంటికి."

"ఇంతేనా? ఐతే విశేషమేముంది? పారిపోయిందంటావేం?"

"ఏమో వాళ్ళంటే నేనన్నాను."

కొంచెం ఆగుతుంది శేషమ్మ ఇంకా ఏమన్నా చెపుతారేమోనని. చెప్పకపోతే -

"నా కెందుకమ్మా! కానీ అక్క ఇంటికి ఎవరు తీసి కెళ్ళారు? ఎవడో మొగాడు ఉంటాడు. బాగా చూడమను. వాతలు పెడితే ఇద్దర్నీ పట్టుకుని - నా కెందుకులే. ఒద్దన్నా నా కెందుకు చెపుతావు! అక్క ఇంటికెళ్ళిందో, ఇంకెక్కడికి వెళ్ళిందో! ఆ అక్క సంగతి తెలుసుగా! దాని షోకులూ, రవ్వలదుద్దులూ - నా కెందుకమ్మా! బండెడు చాకిరీ తెల్లారి లేస్తే, చస్తున్నాను."

"మీ కోడలు పనిచెయ్యదా?"

"అయ్యో, దాని చేతులు పువ్వులట. దాని కాళ్ళు తామరాకులుట!"

"మీ కూతురో?"

"మా కూతురికి గంపెడు రోగమమ్మా! అదేం చేస్తుంది, దాని మొహం!"

"అట్లానమ్మా! బాగానే తిరుగుతూవుంటుందే!"

"మీ కంటికి అట్లానే కనపడుతుంది. పై పుష్టే గానీ, లోపలంతా గుల్ల. ఒకటే ఆయాసం."

"మరి ఎప్పుడూ అట్లా చిరుతిళ్ళు తింటే -"

"అయ్యో, ఏం తింటుంది? అన్నం అసలే తినదు. ఆ చిరుతిళ్ళు కూడా లేకపోతే ఎట్లా బతుకుతుంది?"

"మా కూతురమ్మా, మా సుబ్బలక్ష్మి! దానికి ఒక్కరోజు జబ్బు చెయ్యదు కద!"

"చెయ్యకేమమ్మా! అట్లా తిరిగేవాళ్ళు గబాలున పడతారు. మా మామ మనమడు అంతే. పిడిరాయిలాగు -"

శేషమ్మ ప్రపంచం, పనీ, ఆచారమూ తెల్లవారకట్ట నాలిగింటికి లేచి, రాత్రి పదకొండింటివరకు (మధ్యాహ్నం రెండు గంటలు విశ్రాంతితో) పనిచేస్తుంది. ముప్పై ఏళ్ళనుంచి, ప్రతిదినమూ ఆ విధమూ పనిచేస్తోంది. ఆమె పనిచేసినంతసేపూ, ఆమె నోరూ పనిచేస్తూ

ఉంటుంది, మాటలతో, తిట్లతో. తెల్లారకట్టే రాత్రి అల్లరి చేసిన పిల్లల్నీ, ఎలికల్నీ తిట్లు; తరువాత పదింటిదాకా దాసీదాన్ని తిట్లు: అల్లరి చేసే పిల్లల్నీ కాకుల్నీ తిట్లు; కానీ వీశడు బీరకాయ లివ్వని కూరలదాన్ని, మజ్జిగ దాన్ని తిట్లు. ఈ ముప్పై యేళ్ళలోనూ ఒకరోజు కూడా చిక్కని మజ్జిగ పొయ్యలేదుకదా, ఒక గొల్లది కూడా. పుచ్చిపోనికూరలివ్వలేదు కదా ఒక కూరలవాడు కూడా! మధ్యాన్నించి ఇరుగుపొరుగువాళ్ళనీ, కోడల్నీ, కొడుకు అనాచారాన్నీ, కృతఘ్నతనీ, దేవుణ్ణీ, పిచికల్నీ తోవనపొయ్యేవాళ్ళనీ తిడుతుంది. ఎవరూ లేకపోతే రాత్రి పదింటికి తనని తాను తిట్టుకోవడం ప్రారంభిస్తుంది.

పని చెయ్యలేకుండా ఉండలేదు. అదే ఆమె మతం. ఆమె శరీరమే పనిచేసే మర అయిపోయింది. ఆమె 'ఇన్‌టెలిజెన్సు' ఎప్పుడో మానింది పనిచెయ్యడం. 'రొటీన్' తప్ప ఇంకేమీ ఆమె చాతకాదు. ఒక్క రవ్వ ప్రోగ్రామ్ మారిందా, ఇల్లు పడుకుంటుంది. అంట్ల శుభ్రం, ఇల్లు కడగడం, పేడ చల్లడం, మెతుకులూ, ఎంగిలీ, మైల మైల అని అరవడం - ఇదే బతుకు! ఒక కొత్తపనీ, కొత్త యోచనా రెండూ ఆమె చాతకావు. గానుక్కి కట్టిన ఎద్దు నయం. అందువల్లనే మార్పు అంటే గుండెలు పగిలి చస్తారు. బెత్తం లేకుండా పాఠం చెప్పమంటే, ముసలి స్కూలు మాష్టరుకి ఎట్లా ఉంటుందో, ఇంగువ లేకుండా వంట చెయ్యటమంటే ఆమెకలా ఉంటుంది. టేపు లేకుండా పనిచెయ్యమంటే తాలూకా గుమాస్తాకి ఎట్లా ఉంటుందో, మడికట్టుకోకుండా వండమంటే ఆమెకట్లా ఉంటుంది. ప్రపంచం ముక్కలైనా ఆమెకి అంత ఆశ్చర్యం కలగదు. ఇంతపని ఇన్నేళ్ళు చేసిందా ఎవరికా ఉపయోగమంటే ఏమీ కనపడదు. అందరూ ఆమెని చూసి విసుక్కునేవాళ్ళేగానీ కృతజ్ఞా కనపరిచేవాళ్ళు లేరు. నలుగురికి భోజనం పెడుతోంది. తాను తింటోంది. ఇంటిని మురికి చేస్తుంది. ఎందుకు కడగడానికి కడగడమెందుకు? మళ్ళీ మురికిచెయ్యడానికి. అంతకాలం వంటచేస్తే మూడు వందల మందికి భోజనం పెట్టవచ్చు ఒక మనిషి స్వర్గంలో అంట్లు తోమడమూ, బట్టలారవెయ్యడమూ లేకపోతే ఏం చేస్తుందో ఈ మనిషి?

పాపం? ఏ కొత్తకాంతినీ, ఆశనీ, ఆనందాన్నీ, కోర్కెనీ, అన్నిటినీ త్యజించి, ఆ వంటిల్లే తన ప్రపంచంగా, తన బాధే తన ఆనందంగా, తన చేతికి చిక్కిన అయిదారుగురూ దాసీలతో సహా, తన నోటి తీటను తృప్తిపరచగల సాధనాలుగా, తన ఆచారాన్నీ, తులసికోటనీ చూసుకుని గర్వపడి బతుకుతోంది. భూకంపాలు రానీ, దేశాలు దేశాలు తగలబడనీ, సామ్రాజ్యాలు పడిపోనీ, ఆమెకేమీ సంబంధం లేదు - తన ఇంటికి వంద గజాల సర్కిల్ దాటి ఆమె మనసు పనిచెయ్యదు.

కాపరం, పిల్లలు, ప్రేమ, ఏమీ లేక తనది, స్వంతంగా తనది అనే ఆస్తిగాని మనిషి గాని లేక, క్రమంగా క్రమంగా మనసు మోడైపోయి నిలిచింది ఆమె. ఇంకే ఆసక్తిలేక, ఆ పాతపురాణాలలో విన్న అక్కడక్కడి వచనాలని పట్టుకుని, వాటి వాస్తవత్వంపై తన ఆత్మపురోభివృద్ధిని ఆధారం చేసుకుని కన్నంలో ఎలికవలె బతుకుతోంది.

*ఎవరికైనా ప్రేమించడం కన్నా ద్వేషించడం సులభం. ప్రేమ మనిషిని తన స్వంతంగా చేసుకోవాలని ప్రయత్నిస్తుంది.* ఈ పేద వితంతువు స్వంతం కావడానికి ఎవరంగీకరిస్తారు? తన కోడలికి ఒక్కొక్క బిడ్డే పుడుతుంటే, తన స్వంతం చేసుకోవాలని చూసింది. ఆ తల్లి ప్రతినిమిషమూ జ్ఞాపకం చేసేది ఆ పిల్ల తనదని - చూపుచాతా, నడివడిచాతా. ఆ పిల్లలే మూడేళ్ళు రాగానే అందరికన్న లోకువ గనక కర్రలు తీసుకుని బాదేవారు ఆమెని. ప్రేమ లేక, సంతోషం లేక, జీవితంలో ఇంట్రెస్టు లేక, ఏ బాధపడ్డా కరుణించేవారు లేక, ఇంక విధి లేక ఈ బండచాకిరిలో తన శక్తినీ, ద్వేషంలో తన ప్రేమనీ, తిట్లలో తన అందాన్ని, సార్థకం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఇట్లా ఎందరు ఈ దేశంలో కొయ్యబారిన ఆత్మలతో తమ జీవితాన్ని ఇతరుల జీవితాన్ని క్షోభపెట్టి మృత్యువులో చివరికి తప్పించుకునే స్త్రీలు! కానీ మృత్యువులోనైనా తప్పించుకుంటారా? వాళ్ళ జన్మలో ఉందా ఈలోపం, వాళ్ళనిట్లా చేసిన సంఘపరిస్థితులలో ఉందా? వాళ్ళు సంఘాన్నిట్లా ఎండపెడుతున్నారా, సంఘం వాళ్ళని కొయ్యల్ని చేస్తోందా?

Click here to share your comments on this story.